క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా నిలవండి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తూ కార్యకర్తలకు నాయకులు అండగా ఉండి భరోసా ఇవ్వాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలో మాజీమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి హిందూపురం నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను తెలియజేశామన్నారు. టీడీపీ నాయకుల దాడులు, బెదిరింపుల నేపథ్యంలో నాయకులందరూ సమష్టిగా కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారన్నారు.

వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

పెనుకొండ: పట్టణంలోని సెబ్ కార్యాలయం వద్ద బుధవారం ద్విచక్ర వాహనాలను వేలం వేసినట్లు సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ 8 వాహనాలను ఏఈఎస్ సుబ్రహ్మణ్యం సమక్షంలో వేలం వేశామని పేర్కొన్నారు. వేలం ద్వారా రూ. 39,200 ఆదాయం వచ్చిందన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో హిందూపురం - కదిరి ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాప్పనపల్లి తండాకు చెందిన శివశంకరనాయక్ తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. పోలీసుల వివరాలమేరకు... శివశంకరనాయక్ ద్విచక్ర వాహనంలో గోరంట్ల వైపు నుంచి గుమ్మయ్యగారిపల్లి వెళ్తున్న క్రమంలో ముందు భాగంలో వెళ్తూన్న ఆటోను అతీవెగంగా వెళ్లి ఢీకొన్నాడు. ఈ ఘటనలో శివశంకరనాయక్ గాయపడటంతో హిందూపురం తరలించారు.

1/19 సర్క్యులర్ అమలు చేయాలి



డిపో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

హిందూపురం: ఉన్నతాధికారులను ఎలాంటి ఆదేశాలు లేన్నప్పటికీ హిందూపురం ఆర్టీసీ డిపోలో 1/19 సర్క్యులర్ రద్దు చేయడం బాధకరమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి రంగనాథ్ అన్నారు. బుధవారం డిపో మేనేజర్‌కు అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. చిన్నచిన్న విషయాలపై కూడా డిపోస్పేర్ పెడుతూ లిఫ్ట్ ఇచ్చే అవకాశముప్పటికీ సర్క్యులర్ అమలు చేయకపోవడాన్ని త్రీవంగా ఖండిస్తున్నామని చెప్పారు. 1/19 సర్క్యులర్ రద్దుచేయాలని హెడ్ ఆఫీసు నుంచి ఆదేశాలుంటే తమకు చూపించాలని, లేకపోతే సస్పెండ్ చేసిన ప్రతి ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి



శ్రీకాంతప్పస్వామి (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లిలో వెలసిన లక్ష్మీరంగనాథ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంతప్ప స్వామి (68) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి చెందిన విషయం, తెలుసుకున్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీకాంతప్పస్వామి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు భార్య భాగ్యమ్మతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రికార్డులు సరిగా లేకపోతే ఎలా?



రికార్డులను తనిఖీ చేస్తున్న డీవైఈఓ రంగస్వామి

హిందూపురం టౌన్: పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలను డీవైఈఓ రంగస్వామి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించిన విద్యాకానుక కిట్ల వివరాలు, మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలించగా రికార్డులు సరిగా లేకపోవడంతో హెచ్‌ఎం సామ్రాజ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎం పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా అందడంలేదన్న సమాచారంతోనే పాఠశాల పరిశీలనకు వచ్చామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

ప్రత్యామ్నాయమే మేలు



ఎల్లోటి వద్ద రైతు శ్రీరామరెడ్డి సాగు చేసిన మొక్కజొన్న



మడకశిర చెరువు వద్ద సాగులో ఉన్న రాగి పంట

- సంప్రదాయ పంటలకు స్వస్తి చెబుతున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటల వైపు అన్నదాతల అడుగులు
- మడకశిరలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రత్యామ్నాయ పంటల సాగు ఇలా...

మొక్కజొన్న :	593 హెక్టర్లు
రాగి :	130 హెక్టార్లు
పత్తి :	375 హెక్టార్లు

మడకశిరరూరల్: గత ఏడాది ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగు రైతులకు అన్ని విధాలుగా కలిసిసోచ్చిది. పంటల సాగులో మంచి దిగుబడులు సాధించి లాభాలు పొందారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు మంచి దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని రైతులు భూములను సిద్ధం చేసుకుని మొక్కజొన్న ,పత్తి పంటలను సాగు చేశారు. జూన్‌లోనే రాగి, మొక్కజొన్న, పత్తి పంటలను బోరు బావుల కింద సాగు చేశారు. ఇప్పటికే మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో రైతులు 593 హెక్టార్లల్లో మొక్కజొన్న, 130 హెక్టార్లుల్లో రాగి, 375 హెక్టార్లల్లో పత్తి పంటలను సాగు చేశారు. ఇంకా రాగి, మొక్కజొన్న పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో ప్రోత్సాహం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొక్కజొన్న, రాగి, పత్తి పంటల సాగును ప్రోత్సహించింది. పంట సాగుపై రైతులు ఆసక్తి పెంచుకునేలా అవగాహన కల్పించింది. రైతులు పండించిన పంటలకు గత ప్రభుత్వం మద్దతు కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టింది.

రాగి పంటపై ఆసక్తి

రాగి పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పంట సాగుకు కలుపు ఏరివేత, ఎరువులకు కలిపి రూ.15 వేలు ఖర్చు అవుతుంది. పంట కాలం పూర్తి అయితే ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టిన ఖర్చు పోనూ రైతుకు ఎకరాకు రూ.23 వేలకు పైగా ఆదాయం వస్తుందని చెబుతున్నారు. ఈ పంట సాగుకు పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుందంటున్నారు. ఇప్పుడిప్పుడే నియోజకవర్గంలో రాగి పంట విస్తీర్ణం పెరుగుతోందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

మొక్కజొన్నతో లాభాలు



బోరు బావి కింద ఎనిమిది ఎకరాల్లో యాజమాన్య పద్ధతులను పాటిస్తూ మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఎకరా పంట సాగుకు విత్తనాలు, మందులు, ఎరువులు, కలుపుతీతకు రూ.18 వేల ఖర్చు పెట్టాను. గత ఏడాది రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో మంచి దిగుబడి సాధించాను. పంటకు మద్దతు ధర లభించడంతో ఎకరాకు రూ.35 వేలకు పైగా ఆదాయం వచ్చింది. మూడేళ్ల నుంచి మొక్కజొన్న పంటను సాగు చేసి లాభాలు పొందుతున్నాను. ప్రస్తుతం ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను.

– శ్రీరామరెడ్డి, రైతు ఎల్లోటి, మడకశిర మండలం

రాగి పంట లాభదాయకం



గత ప్రభుత్వం రాగి పంటను ప్రోత్సహించడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరు బావి కింద ఎకరాలో రాగి పంట సాగు చేశాను. ఎకరాలో రాగి పైరు వేయడం, కలుపుతీత, ఎరువులు ఇతర ఖర్చులకు రూ.12 వేల పెట్టుబడి పెట్టాను. పంట ఆశాజనకంగా ఉంది. తెగుళ్ల సోకకపోతే దిగుబడి కూడా బాగా వచ్చే అవకాశం ఉంది. రాగి పంట సాగుకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుంది. చిరుధాన్యాల ఒకటైన రాగి పంట సాగు లాభాదాయకం.

– కెంచప్ప, రైతు ,అగళి మండలం

రైతులను ప్రోత్సహిస్తున్నాం



మడకశిరరూరల్: ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా మంచి దిగుబడులు సాధిస్తూ ఆదాయం పొందవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నాం. గతంలో కేవలం వేరుశనగనే ఎక్కువ సాగు చేసి నష్టపోయే వాళ్లు. అయితే ఇప్పుడు మొక్కజొన్న, రాగి, పత్తి పంటలను అధికంగా సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. పంటలకు తెగుళ్ల సోకకుండా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– తిమ్మప్ప, మండల వ్యవసాధికారి మడకశిర మండలం

వీఆర్‌ఓ రామకృష్ణ అకాల మృతి



వీఆర్‌ఓ రామకృష్ణ భార్య జయమ్మకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్



రామకృష్ణ (ఫైల్)

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్)గా పనిచేస్తున్న రామకృష్ణ (54) బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మంగళవారం ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయితే బుధవారం పరిస్థితి విషమించడంతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కన్నీటి పర్యంతమైన అధికారులు

వీఆర్‌ఓ రామకృష్ణ చనిపోయారన్న తెలుసుకున్న పరిగి తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూశాఖ అధికారులతో పాటూ సిబ్బంది భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. తహసీల్దారు రాజేశ్వరీ, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహ, సీనియర్ అసిస్టెంట్ మురళీధర్, ఆర్ఐ సిద్దేశ్వర్‌తో పాటూ పూర్వపు తహసీల్దారు సౌజన్యలక్ష్మీ తదితరులు రామకృష్ణ మృతికి సంతాపం తెలిపారు.

సబ్‌కలెక్టర్ నివాళి

గుండెపోటుతో చనిపోయిన వీఆర్‌ఓ రామకృష్ణ మరణవార్త తెలుసుకున్న పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ బుధవారం సాయంత్రం ఆయన స్వగ్రామం మణూరుకు వెళ్లారు. రామకృష్ణ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య జయమ్మకు తక్షణ ఆర్థిక సాయాన్ని అందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు వినతి

మడకశిర: నియోజకవర్గానికి 412 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని ఆశాఖ ఎస్‌ఈ సురేంద్రను బుధవారం కలిసి విన్నవించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 1000 వ్యవసాయ సర్వీసులు కూడా మంజూరు చేయాలని కోరామన్నారు. ఇందుకు ఎస్‌ఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందిస్తాం



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు తదితర అంశాలపై టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జేఈ వెంకటస్వామిలతో కలిసి అయన వివరించారు. ఆస్పత్రిలో కొన్ని విభాగాల్లో రోగుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ఎవరైనా అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను అనవసరంగా ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తే, రెఫర్ చేసిన వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను వైద్యులు వారు నిర్వహించే ఆస్పత్రులకు తీసుకెళితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనకాడమన్నారు. సిటీ స్కాన్ సేవలతో పాటు వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకువచ్చి, ఐసీయూ ఏర్పాటు చేస్తామన్నారు. ఈఎన్‌టీ విభాగానికి సంబంధించి మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఈ సేవలను సైతం విస్తృతంగా చేపడతామన్నారు. సమావేశంలో ఆర్ఎంఓ డేవిడ్ రాజు, ఇతర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే పావగడకు తుంగభద్ర జలాలు

- సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతోంది
- మంత్రి ప్రియాంక్ ఖర్గే



పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి ప్రియాంక్ ఖర్గే

పావగడ: 'సాంకేతిక కారణాలతో పావగడ నియోకవర్గానికి తుంగభద్ర జలాల రాక ఆలస్యమవుతోంది. త్వరలోనే సమస్యలను అధికమించి తుంగభద్ర జలాలను అందిస్తాం' అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖామంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. ఆయన బుధవారం పావగడకు చేరుకుని తుంగభద్ర తాగునీటి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా బెళ్లిబట్లు, కారనాగనహట్టి గ్రామాల మధ్య నిర్మించిన సుమారు 13 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న భారీ ట్యాంక్, పంప్‌హౌస్‌ను పరిశీలించారు. అలాగే తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా చేయడానికి నిర్వహించిన పైప్‌లైన్ మ్యాప్ చూశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు తుంగభద్ర తాగునీటి ప్రాజెక్ట్ డిజైనింగ్‌కే పరిమితమయ్యాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లలోపే ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తి చేసిందన్నారు. రూ.2,137 కోట్ల నిధులతో మొలకాల్మూరు, చళ్లకెరె, పావగడకు అందించే తుంగభద్ర తాగునీటి ప్రాజెక్ట్ నుంచి తాగునీటిని చిట్ట చివరి గ్రామాలకు సైతం అందేలా చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలో రింగ్‌రోడ్డు, బైపాస్ రోడ్డు నిర్మాణాలకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, చళ్లకెరె ఎమ్మెల్యే రఘుమూర్తి, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఏ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో మారెమ్మ

హిందూపురం: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద ఉన్న మధుగిరి మారెమ్మ ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల అర్చనలు, పూజలు నిర్వహించి పారాయణం, భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు భరత్ కుమార్, వాల్మీకి రామ భజన మందిర సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు కరాటే పోటీలకు ఎంపికైనట్లు కరాటే మాస్టర్ మహేంద్ర తెలిపారు. ఈ నెల 21న హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరగనున్న మొదటి అంతర్జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలకు యక్షిత్, సలోని, హార్థిని కటాస్ విభాగంలోని జూనియర్ కేటగిరిలో ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను కరస్పాండెంట్ నాగమణి, మాస్టర్ రామచంద్ర అభినందించారు.

అంగన్వాడీలపై వేధింపులను అరికట్టండి



మడకశిరలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



హిందూపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం



పెనుకొండ: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

మడకశిర: తమ సమస్యలు పరిష్కరించాలని, అధికార పార్టీ నాయకుల వేధింపులను అరికట్టాలని, రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలని కోరుతూ బుధవారం పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ర్యాలీ నిర్వహించారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. రాజీనామాలు చేయాలని కొంత మంది అధికార పార్టీ నాయకులు పలు జిల్లాల్లో ఒత్తిడి చేస్తున్నారని, అధికార పార్టీ నాయకుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలి, తదితర తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతికి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినతి పత్రాలు అందించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఉషారాణి, శ్రీదేవి, పద్మ, సీఐటీయూ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో కలిసి బుధవారం సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రవీణ్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, సీపీఐ నేతలు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఐకేపీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్వచ్ఛభారత్ ఇతర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. కోర్కెల దినోత్సవంలో భాగంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్‌కు అందించారు. నాయకులు బాబావలి, రాజారావు, జయమ్మ, బావమ్మ, మాబున్నీసా, సావిత్రమ్మ, పద్మ, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గర బుధవారం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన కార్మిక చట్టాల ద్వారా కార్మికులు బానిసలుగా మారే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వాలు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను కొన్ని ప్రాంతాల్లో వేధిస్తున్నారని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, రామకృష్ణ, బాబా, జ్యోతమ్మ, జగదీష్, మల్లికార్జున, సదాశివరెడ్డి, జయరామిరెడ్డి, నందీశ్వర, శైలమ్మ, వరలక్ష్మీ, శిరీష, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో తహసీల్దార్ వెంకటసుబ్బయ్యకు అందజేశారు. ఇందులో భాగంగానే తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఐఎల్‌సీ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, పింఛన్, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నాయి.

రొళ్ల: మండల కేంద్రంలో అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న అంగనవాడీ, ఆశ వర్కర్లు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. నిరసన అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ భద్రుజమకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ వేంకటేశ్వర్లుకు అంగన్వాడీ, ఆశాలు వివిధ డిమాండ్లతో కుడిన వినతి పత్రాని అందజేశారు.

లేపాక్షి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తహసీల్దార్ బాలనరసింహులకు బుధవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహులు, ధనమ్మ, భాగ్యమ్మ, పార్వతి, శశికళ, రాధమ్మ, పద్మావతి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో 'అతిసారం' దూరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ: గ్రామీణ ప్రాంతాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సౌందర్య తెలిపారు. మండల పరిధిలోని ఫళారంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సుధారాణి, ఖాదర్‌వలి, రవికుమార్, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోండి

లేపాక్షి: మండలంలో అన్ని గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణంలో మొహర్రం వేడుకలను జరుపుకోవాలని ఎస్ఐ గోపీ ఒక ప్రకటనలో కోరారు. మొహర్రం పండుగ జరుపుకునే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని హెచ్‌ఎం విశ్వనాథ్ కోరారు. బుధవారం బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో 11 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతల సహకారంతో రూ.30 వేల విలువ చేసే పలకలు, విద్య సామాగ్రిన్ని హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, అప్పుడే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. దాతల సహకారంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు మరింతగా సహకారం అందిస్తామన్నారు. అనంతరం హెచ్‌ఎం విశ్వనాథ్‌ను ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ జయపాల్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.